క్లుప్తంగా

అందుబాటు ధరల్లోకి క్రీడా పరికరాలు

డీఎస్‌డీఓ అఫ్రోజ్ ఖాన్



గుంటూరు వెస్ట్(క్రీడలు): కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ తగ్గించడం వలన క్రీడాకారులకు ఎంతో మేలు అని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ తెలిపారు. శనివారం స్థానిక బీఆర్ స్టేడియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అఫ్రోజ్ ఖాన్ మాట్లాడుతూ గతంలో క్రీడా పరికరాలు పైన కూడా ఎక్కువ శాతం జీఎస్టీ ఉండటం వలన క్రీడా పరికరాలు కొనుగోలు చేయాలంటే కొద్దిగా తల్లిదండ్రులు ఇబ్బంది పడేవారన్నారు. ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించడం వలన క్రీడా పరికరాలు ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం శిక్షకులు రామకృష్ణ, అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, నూర్, మణికంఠ, అరుణ్ కుమార్, బీఆర్ స్టేడియం శిక్షకులు శివారెడ్డి, అహ్మద్, నవీన్ పాల్గొన్నారు.

వివక్ష, అణచివేతలపై నిరంతర పోరాటం



లక్ష్మీపురం: కుల ఆధారిత వివక్ష అణచివేతలపై నిరంతర పోరాటం అవసరమేనని సీనియర్ విద్యావేత్త, విశ్లేషకులు వి.సింగరయ్య అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో కుల వ్యవస్థను పటిష్టం చేసేందుకు మనువాద శక్తులు ప్రయత్నాలు తీవ్రతరం చేశాయని హెచ్చరించారు. చర్చాగోష్టిలో విద్యావేత్త చంద్రయ్య, న్యాయవాది హరి ప్రసంగించారు.

అలరించిన వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర



నగరంపాలెం: స్థానిక సీతమ్మకాలనీ ఒకటో వీధిలోని శ్రీఅంకమ్మ తల్లి దేవస్థానం ఆవరణలో ఏపీ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి నాటక అకాడమీ(విజయవాడ) ఆధ్వర్యంలో శనివారం రాత్రి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర పౌరాణిక భక్తి రస నాటిక ప్రదర్శించారు. హార్మోనియంపై వేణుగోపాల్, క్లారినెట్ రంగారావు, డోలక్‌పై మోపర్రు శ్రీను, డి.చిన్నబాపిరెడ్డి సంగీత సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో వెంకటరమణ నాట్యమండలి అధ్యక్షులు బాణాల సుబ్బారావు (గుంటూరు), 28వ డివిజన్ అధ్యక్షులు తెల్లగుర్ల అప్పారావు, పౌరాణిక కళాకారుల సంఘం అధ్యక్షులు నల్లక శ్రీనివాసరావు పాల్గొనగా, కళాకారులను సత్కరించారు.

సైబర్‌క్రైమ్‌పై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో శనివారం సైబర్‌క్రైమ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ రామాంజనేయ, హెడ్ కానిస్టేబుల్స్ రాజకిషోర్, కోటేశ్వరరావు పాల్గొని సోషల్ మీడియా ప్లాట్‌ఫాం, లోన్ యాప్స్, ఏపీకే ఫైల్స్, సైబర్ స్టాకింగ్, హ్యాకింగ్ మోసాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్సార్కే ప్రసాద్, బి.రోహిణీదేవి పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో ఆస్తి పన్ను వసూలు కీలకం

నగర మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: నగరాభివృద్ధిలో ఆస్తిపన్ను వసూళ్లు కీలకమని, ప్రతి వార్డు సచివాలయం పరిధిలో బకాయిలు, ప్రస్తుత పన్ను నూరు శాతం వసూలు చేసేలా కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. శనివారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులతో రెవెన్యూ వసూలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి పన్ను మీటర్ల చార్జీల వసూలులో అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్ను వసూలుపై పురోగతి లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 21 నుంచి రోజువారీ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పన్ను వసూళ్లపై సమీక్ష చేస్తామన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి చివరికి సచివాలయంలో నూరు శాతం పన్ను వసూళ్ల లక్ష్యంగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు రవి కిరణ్ రెడ్డి, సాదిక్ బాషా పాల్గొన్నారు.

అధికారం మాది.. అడ్డొస్తే తొలగిస్తాం

- వార్డుల్లో రెచ్చిపోతున్న టీడీపీ నేతలు
- అధికారులకు బెదిరింపులు
- వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు లేకుండానే క్లీన్ ఎయిర్ అవగాహన ర్యాలీ
- నగర మేయర్, కమిషనర్‌కు ఫిర్యాదు



మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

నెహ్రూనగర్: అధికారం మాది.. కార్పొరేటర్ రాకపోయిన కార్యక్రమాన్ని ప్రారంభించండి అంటూ 53వ డివిజన్ టీడీపీ వార్డు ప్రెసిడెంట్ నగరపాలక సంస్థ అధికారులపై విరుచుకుపడ్డాడు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా క్లీన్ ఎయిర్ అంశంపై నగరంలో అన్ని వార్డుల్లో అవగాహన ర్యాలీలు శనివారం నిర్వహించారు. అయితే ఈ క్రమంలో 53వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ దూపాటి వంశీకి ఆహ్వానం పంపారు. దీంతో పాటు అధికార పార్టీ అయిన టీడీపీ నాయకులకు ఆహ్వానం పంపారు. కార్పొరేటర్ వంశీ వచ్చేలోగా ర్యాలీ ప్రారంభించాలని అధికారులపై టీడీపీ నేతలు ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో చేసేదేమి లేక కార్పొరేటర్ లేకుండానే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంతలో అక్కడికి చేరుకున్న కార్పొరేటర్ వంశీ, కార్పొరేటర్ లేకుండా కార్యక్రమాన్ని ఏ విధంగా ప్రారంభిస్తారని అధికారులను నిలదీశారు. అక్కడే ఉన్న టీడీపీ శ్రేణులు అధికారం మాది మీరు వచ్చే దాకా మేము ఆగాలా.. అవసరం అయితే అధికారులను మారుస్తామని చెప్పడంతో అధికారులు కూడా నిర్ఘాంతపోయారు. దీంతో కాసేపు వైఎస్సార్ సీపీ శ్రేణులకు, టీడీపీ శ్రేణులకు వాగ్వాదం జరిగింది. అదే విధంగా 34వ వార్డులో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ బూసీ రాజలతకు కార్యక్రమానికి రావాలని కనీసం ఆహ్వానం కూడా ఇవ్వలేదని వాపోయారు. 54వ డివిజన్‌లో కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మల్లవరపు రమ్య కార్యక్రమానికి హాజరైతే టీడీపీ నాయకులు వచ్చేంత వరకు కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించలేదని వాపోయారు. వైఎస్సార్ సీపీ గెలిచిన వార్డుల్లో కార్పొరేటర్లపై వివక్షను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మాట్లాడుతూ మమ్మల్ని కావాలనే ప్రభుత్వ కార్యక్రమాలకు పిలిచి అవమానపరుస్తున్నారని.. కొంత మంది అధికారులైతే కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. డివిజన్‌లో జరిగే ప్రతి కార్యక్రమానికి కార్పొరేటర్‌కు చెప్పకుండానే టీడీపీ నేతలు చేసుకోవడం సమంజసం కాదన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. స్పందించిన మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు డివిజన్‌లో కార్పొరేటర్‌కు చెప్పకుండా కార్యక్రమాలు చేపట్టే అధికారుల వివరాలు తమకు అందజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మేయర్, కమిషనర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు కామిరెడ్డి రంగారెడ్డి, మొహమూద్, అబీద్‌బాషా, పోలవరపు జ్యోతి వెంకటేశ్వర్లు, అచ్చాల వెంకటరెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), దూపాటి వంశీ, మల్లవరపు రమ్య, పాపతోటి అంబేడ్కర్, బూసి రాజలత, పడాల సుబ్బారెడ్డి, కాంట్రకుంట గురవయ్య, బోడపాటి ఉషారాణి కిషోర్, గేదెల రంగమణి రమేష్ పాల్గొన్నారు.

కావాలనే ఎస్సీ వార్డులే టార్గెట్..

గుంటూరు నగరంలో ఎస్సీ వార్డుల్లోనే పాలకవర్గం కావాలని ఎస్సీ కార్పొరేటర్లు అవమానపరుస్తున్నారని 53వ డివిజన్ కార్పొరేటర్ దూపాటి వంశీ, 54వ డివిజన్ కార్పొరేటర్ మల్లవరపు రమ్య వాపోతున్నారు. ప్రతి సారి డివిజన్‌లో మమ్మల్ని పిలవడం ఆ తరువాత మేము లేకుండానే కార్యక్రమాలు చేసుకోవడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మేము అధికార కార్యక్రమాలకు అన్ని పార్టీలతో కలుపుకుని పోతున్నప్పటికి కూడా మమ్మల్ని కావాలనే అవమాన పరుస్తున్నారని పేర్కొన్నారు.

ఆధునికీకరించిన లెక్చరర్ గ్యాలరీ, లేబొరేటరీ ప్రారంభం



దాత ప్రమీలను అభినందిస్తున్న డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజీలో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శనివారం పెథాలజీ వైద్య విభాగంలో ఆధునికీకరించిన లెక్చరర్ గ్యాలరీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో ఆధునిక ప్రయోగశాల (లేబొరేటరీ) ను గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి, దాత కామరాజు ప్రమీల చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్(అడ్మిన్) డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ పెథాలజీ లెక్చరర్ గ్యాలరీ ఆధునికీకరణకు దాతలు చూపిన సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ఈ విభాగానికి గర్వకారణమని తెలిపారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సీతారామ మాట్లాడుతూ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి నాయకత్వంలో పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు వచ్చి కాలేజీ అభివృద్ధికి చేయూతనివ్వడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆధునిక సదుపాయాలతో బోధన చేసేందుకు విద్యార్థులు, అధ్యాపకులకు మరింత ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ ప్రతి రూపాయి దాతల విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. దాతల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మా బాధ్యత అని వెల్లడించారు. గుంటూరు మెడికల్ కాలేజీని దేశంలోని అత్యుత్తమ వైద్య విద్యాసంస్థలలో ఒకటిగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని చెప్పారు. దాత ప్రమీల మాట్లాడుతూ వైద్య విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉండి కృషితో వైద్య విద్యనభ్యసించి సమాజానికి సేవ చేయాలి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రమీల కుటుంబ సభ్యులు డాక్టర్ సుశీలకుమార్, డాక్టర్ అభిరామ్, డాక్టర్ అనిల్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు దీపావళి సంబరాలు



కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్లో చిన్నారులతో హేమలత, చిన్నారులు



సరస్వతీదేవి విగ్రహం వద్ద దీపం వెలిగిస్తున్న కృష్ణప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: రాజేంద్రనగర్‌లోని కెనడీస్ నెక్స్‌జెన్ కిడ్స్ పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా నూతన వస్త్రాలను ధరించిన చిన్నారులు దీపాలతో పాఠశాల లోపల ప్రాంగణాన్ని అలంకరించారు. ప్రిన్సిపాల్ పీఎల్ హేమలత ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులు లక్ష్మీదేవి పూజ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య మాట్లాడుతూ దీపావళిని కాలుష్యరహితంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం నరకాసురుని బొమ్మను కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

కేఎల్‌పీ స్కూల్లో..

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో శనివారం ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రాంగణంలోని శ్రీసరస్వతీదేవి విగ్రహం వద్ద కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, అకడమిక్ కో–ఆర్డినేటర్ బి.శైలజ దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ దీపావళి విద్యార్థులకు ఎంతో ఇష్టమైన పండుగ అని, బాణసంచా కాల్చడంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారని అన్నారు. ప్రిన్సిపాల్ రత్తయ్య మాట్లాడుతూ కుటుంబ సభ్యులందరు కలసి ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగగా దీపావళిని జరుపుకోవాలని సూచించారు. ఈసందర్భంగా బాణసంచా కాల్చి సందడి చేశారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

డీఎస్పీ అరవింద్

లక్ష్మీపురం: బాణసంచా విక్రయించే వారు తప్పనసరిగా నిబంధనలు పాటించాలని వెస్ట్ డీఎస్పీ అరవింద్ పేర్కొన్నారు. నగరంపాలెంలోని కార్యాలయంలో శనివారం రాత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అరండల్‌పేటపేట, నగరంపాలెం, పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో పరిధిలో బాణసంచా తయారీ, విక్రయాలు నిర్వహించే వారు లైసెన్సు కలిగి ఉండాలన్నారు. పేలుడు పదార్థాలను ఇళ్లలో నిల్వ ఉంచరాదన్నారు. శాశ్వత, తాత్కాలిక లైసెన్సు పొందిన దుకాణాల్లో మాత్రమే విక్రయాలు జరగాలని సూచించారు. ఫిర్యాదుల కోసం 101, పోలీస్ డయల్ 100/112, స్థానిక పోలీసులు అరండల్‌పేట 0863–2231955, నగరంపాలెం పోలీస్ స్టేషన్ 0863–2234047, పట్టాభిపురం పోలీస్ స్టేషన్ 0863–2231866 సంప్రదించాలని కోరారు.

22న ఏఐఎస్‌ఎఫ్ బస్సు జాతా పోస్టర్ల ఆవిష్కరణ



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నేతలు

లక్ష్మీపురం: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్‌ఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న బస్సు జాతాను జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్ జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాసర్‌జీ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి నవంబర్ 12 వరకు ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి బస్సు జాతా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పీపీపీ పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తున్న కూటమి ప్రభుత్వం ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్యం పేదలకి అందజేయాలని ఆలోచన ఉంటే నారాయణ, గీతం, విట్ కళాశాలలో పీపీపీ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందక ఉద్యోగ, ఉపాధి లేక ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో విడుదల కాక విద్యార్థుల నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త విద్యార్థి ఉద్యమానికి సిద్ధమవుతూ చేపట్టిన బస్సు యాత్రను విద్యార్థులు, మేధావులు, తల్లిదండ్రులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి ప్రణీత్, జిల్లా నాయకులు అజయ్, చందు, సుభాష్, అమీర్, అశోక్ పాల్గొన్నారు.

శారదానికేతన్‌లో ఆకట్టుకున్న అష్టావధానం



గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని శ్రీ శారదానికేతన్ మహిళా విద్యాసంస్థలో శనివారం నిర్వహించిన అష్టావధానం ఆకట్టుకుంది. ఈసందర్భంగా పెద్ది సాంబశివరావు సహకారంతో గుళ్లపల్లి సుబ్బారావు సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళి అష్టావధానం నిర్వహించారు. డాక్టర్ పి.విజయలక్ష్మి సంధానకర్తగా వ్యవహరించారు. డాక్టర్ ఎస్వీఎస్ఎల్ ఫణికామేశ్వరి (నిషిద్ధాక్షరి), జేటీవీ లక్ష్మి (సమస్యాపూరణం), డాక్టర్ ఎన్‌సీహెచ్ సుధా మైథిలి (దత్తపది), వి.రాజ్యలక్ష్మి (వర్ణన), పి.శ్రీవాణి (పురాణ పఠనం), డాక్టర్ పి.విజయలక్ష్మి (వ్యస్తాక్షరి), వీవా స్కూల్ డైరెక్టర్ ఎం.వేదవాణి (ఆశుకవిత్వం), జె.యశోధలక్ష్మి (అప్రస్తుత ప్రసంగం) గావించారు. కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు త్రిపురనేని రామస్వామి పురస్కార ప్రదానోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: కవిరాజు త్రిపురనేని రామస్వామి పురస్కార ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేట 2వ లైనులోని సీపీఎం కార్యాలయంలో సాయంత్రం 5.00 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా సాహితీ విమర్శకులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, రాజకీయ, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు వివరించారు.

బాలికను గర్భిణిని చేసిన వ్యక్తి అరెస్ట్

పట్నంబజారు: బాలికను గర్భిణిని చేసిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరపరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. వడ్డెరగూడేనికి చెందిన మహంకాళీ వీరాంజనేయులు, తన కుమార్తె స్నేహితురాలికి మాయమాటలు చెప్పి, కొద్ది రోజుల కిందట పిడుగురాళ్ల తీసుకెళ్లాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వీరాంజనేయులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. తన ప్రవర్తనలో మార్పు రాని వీరాంజనేయులు బాలికను తీసుకుని ఉడాయించాడు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించి, దాచేపల్లి సమీపంలో ఇద్దరిని గుర్తించారు. బాలిక ఆరు నెలల గర్భిణిని చేసిన వీరాంజనేయులపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్ అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.

నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలి



నెహ్రూ నగర్: విద్యార్థులు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగుతూ.. చదవగలిగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కెనరా బ్యాంక్ రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి.నర్సిరెడ్డి పేర్కొన్నారు. రెడ్డి జన సేవా సమితి, రెడ్డి జనాభ్యుదయ మండలి ఆధ్వర్యంలో ఉడుముల నర్సిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సిరెడ్డి ఎంతో ఉన్నతంగా ఆలోచించి ఆనాడు రెడ్డి హాస్టల్ ఏర్పాటు చేసి.. ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారన్నారు. ఆయన స్ఫూర్తిగా అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగుతూ దాతలు ఇచ్చిన సహకారంతో ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ కార్డియాలజిస్ట్ జీఎస్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ వెలగల జయ పాల్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో మండలి నాయకులు చల్లా అంజిరెడ్డి, కంది సంజీవరెడ్డి, సూరసాని వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, పి.వెంకటరెడ్డి, జె.సత్యనారాయణ రెడ్డి, వి.సూరారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పదవుల నియామకం



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పలువురిని పార్టీ పదవుల్లో వివిధ హోదాల్లో నియమించారు. ఈమేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గుంటూరు తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎస్సీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా దొప్పడపూడి అంకాల రాజు, ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా పాలపర్తి గోవర్ధన్, ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా కె.పాపయ్య, జిల్లా అధికారప్రతినిధిగా పఠాన్ అబ్దుల్లా ఖాన్(నాగూర్ ఖాన్) లను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

మహిళా విభాగం నగర అధ్యక్షురాలిగా సుబ్బులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు నగర అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలిగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన కీసరి సుబ్బులు, పబ్లిసిటీ విభాగానికి సంబంధించి యాదాల వెంకటేశ్వర్లు(చిన్న), వైఎస్సార్ టీయూసీ నగర అధ్యక్షుడిగా పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మేడా మురళీ శ్రీనివాస్, లీగల్ విభాగం నగర అధ్యక్షుడిగా కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, యువజన విభాగానికి సంబంధించి నగర ఉపాధ్యక్షులుగా గుంటూరు ఈస్ట్‌కు చెందిన షేక్ రబ్బాని, పశ్చిమకు చెందిన ఎర్రెడ్ల వెంకటేశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ధూపాటి అనిల్, కార్యదర్శులుగా మద్దూరి రామకృష్ణారెడ్డి, చెరుకుల ప్రశాంత్‌రెడ్డి, పఠాన్ ఇమ్రాన్‌ఖాన్‌లను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

పారిశుద్ధ్య విధుల్లో బాధ్యతగా ఉండాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



వ్యర్థాలతో నిండిపోయిన డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో పారిశుద్ధ్య విధుల్లో సిబ్బంది, అధికారులు బాధ్యతగా పనిచేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. గుండారావుపేటలో పారిశుద్ధ్య పనులు, చెక్కల బజార్‌లో ఆక్రమణలను శనివారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. గుండారావుపేట, జీటీ రోడ్లలో డ్రెయిన్ల అపరిశుభ్రతపై స్థానిక ప్రజారోగ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువలను మధ్యాహ్నం సమయంలో శుభ్రం చేయాలని, కాలువల్లో టీ కప్పులు, వ్యర్థాలు వేసే షాపులను సీజ్ చేసి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులకు సూచించారు. ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చే ప్రజారోగ్య కార్మికులకే చెత్త ఇవ్వాలే తప్ప రోడ్ల మీద, కాలువల్లో వేయవద్దని సూచించారు. డ్రైన్, రోడ్ ని ఆక్రమణ చేసిన చెక్కల బజార్ లో ఆక్రమణలను తక్షణం తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. జీటీ రోడ్ లో ఆక్రమణల తొలగింపు అనంతరం నూరు శాతం పూడిక తీయించాలని ఇంజినీరింగ్ అధికారులను, ఆక్రమణలు పునరావృతం కాకుండా పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

అన్నా క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలి..

అన్నా క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలని, పర్యవేక్షణ కోసం విధులు కేటాయించిన వార్డు సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షణ చేసి, ఏమైనా లోపాలు గుర్తిస్తే నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం పల్నాడు బస్టాండ్ సెంటర్ లోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్ల పరిసరాల్లో ఆహారం తీసుకునే వారికి ఇబ్బంది లేకుండా పరిశుభ్రత పాటించాలని కోరారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కోరారు. ప్రతి రోజు ప్రభుత్వ నిర్దేశిత సమయంలో ఆహారం అందుబాటులో ఉండేలా, మౌలిక వసతులు కల్పించేలా పర్యవేక్షణ కోసం వార్డు సచివాలయ కార్యదర్శులను కేటాయించామని, వారు నిర్దేశిత సమయంలో క్యాంటీన్‌లో ఉండాలన్నారు. క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రంకు అధిక ప్రాధాన్య ఇవ్వాలని కోరారు.

విద్యుత్ భవన్‌లో సూపర్ జీఎస్టీపై అవగాహన



మాట్లాడుతున్న చల్లా రమేష్, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌బాబు

కొరిటెపాడు(గుంటూరు): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ సంస్కరణల వలన పునరుత్పాదక శక్తి పరికరాలపై జీఎస్టీ భారీగా ప్రయోజనాలు కలుగుతాయని విద్యుత్‌శాఖ గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ చల్లా రమేష్ పేర్కొన్నారు. పొన్నూరు రోడ్‌లోని విద్యుత్ భవన్‌లో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సౌరశక్తి, పవన్ శక్తి, జల విద్యుత్ పరికరాలపై జీఎస్టీ తగ్గిందని వివరించారు. అలాగే బయోగ్యాస్ యూనిట్ ధర గతంలో రూ.1.50 లక్షలు ఉండగా, ఇప్పుడు రూ.1.40 లక్షలు అని పేర్కొన్నారు. ఐదు హెచ్‌పీ సౌర పంపుసెట్ ధర గతంలో రూ.2.50 లక్షలు ఉండగా, నేడు రూ.2.21 లక్షలకు చేరుకుందని తెలిపారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఒక్క నెలలో చాలా ఆదా చేయొచ్చన్నారు. మన ఇంటి డాబా పైన సోలార్ పలకలు బిగించుకోవడం వలన మన కరెంట్ బిల్లుని ఆదా చేసుకోవచ్చని, దీని ద్వారా జీఎస్టీ 2.0 సంస్కరణలు గతంలో ఉండేదని, ఇప్పుడు ఐదు శాతం తగ్గించడం జరిగిందన్నారు. పీఎం సూర్య ఘర్ వెండార్ వారు విద్యుత్ బిల్లు, ఆధార్ కార్డు, రూ.999 కట్టినటో ఇంటి మీద సోలార్ పలకలు బిగించుకోవచ్చన్నారు. పీఎం సూర్య ఘర్‌పై విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. సదస్సులో విద్యుత్ శాఖ టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.నాగేశ్వరరావు, టౌన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాస్‌బాబు, పి.రామిరెడ్డి పాల్గొన్నారు.

అమెరికా టారిఫ్‌లను కేంద్రం వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

లక్ష్మీపురం: అమెరికా టారిఫ్‌ల పెంపును కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని, ప్రభావం పడే రంగాలను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు కోరారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో స్పిన్నింగ్ మిల్లులపై ప్రభావం పడుతుందన్నారు. వీటిల్లో ఎక్కువగా మహిళా శ్రామికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీటితో వీసాలపై నిబంధనలు కఠితరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వల్ల ఎన్నో ఆశలతో ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నో ఏళ్ల నుండి ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకు నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. టిడ్కోగృహాలకు డిపాజిట్లు చెల్లించినా ఇంత వరకు ఇళ్లు స్వాధీనం చేయని వారికి వెంటనే చేయాలని, రాజీవ్ గృహ కల్ప, టిడ్కో ఇళ్లలకు, జగనన్న కాలనీలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. రాజధాని ప్రాంతంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలలో అక్కడి విద్యార్థులకు రాయితీ కల్పించాలని, భూ సేకరణ చట్టం ప్రకారం ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎన్.భావన్నారాయణ, ఎన్.నళినీకాంత్, ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు ఎల్.అరుణ, డి.శ్రీనివాసకుమారి, వి.జవహర్‌లాల్, ఎస్.ఎస్.చెంగయ్య, పి.కృష్ణ, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు డివిజన్ పరిధిలో 2026–27 విద్యాసంవత్సరానికి కొత్తగా ప్రైవేటు పాఠశాలలను ఏర్పాటు చేసుకునేందుకు సీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉప విద్యాశాఖాధికారి జి.యేసురత్నం శనివారం ఓ్రప్రకటనలో తెలిపారు. పాఠశాలలకు అనుమతితో పాటు 8,9,10 తరగతుల అప్‌గ్రేడేషన్ కోసం ప్రతిపాదనలు, పాఠశాలల గుర్తింపు రెన్యూవల్ కోసం ఆసక్తి కలిగిన ప్రైవేటు యాజమాన్యాలు తగిన డాక్యుమెంట్లతో ఫీజు చెల్లించి, వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు దరఖాస్తు చేయాలని సూచించారు. విద్యాశాఖ నుంచి అనుమతి పొందకుండా తరగతులు నిర్వహించినచో సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.